క్లుప్తంగా

ఎవరెస్ట్ అధిరోహించిన విద్యార్థికి అభినందన



బొడ్డు రాణిని అభినందిస్తున్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్

దెందులూరు: మౌంట్ ఎవరెస్టును 2017లో అధిరోహించిన లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన బొడ్డు రాణి ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థిని కావడం తనకెంతో సంతోషంగా ఉందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. బుధవారం ఏలూరు ఎంపీ కార్యాలయంలో ఏపీ లిడ్క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ ఎవరెస్ట్ విజేత బొడ్డు రాణిని ఎంపీకి పరిచయం చేశారు. 800 మీటర్లు, 1,500 మీటర్ల పోటీల్లో జాతీయస్థాయిలో ఆమె గోల్డ్ మెడల్స్ సాధించిందని ప్రస్తుతం డీపీఈడీ విద్యనభ్యసిస్తోందని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగకల్పనకు కృషి చేస్తానని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని రాణి అభినందించి సత్కరించారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

ఉంగుటూరు: మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి వర్ధంతిని నారాయణపురంలో బీజేపీ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద బీజేపీ శ్రేణులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, పార్టీ మండల అధ్యక్షుడు వంజరపు దుర్గారావు, బీజేపీ ఏలూరు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ నూకల రోహిత్ నాయకుడు, బిట్టు, తాతబాబు, వాసు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెదవేగి : గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలు వ్యాధుల భారినపడకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని పెదవేగి ఎంపీడీవో జి రాజ్‌మనోజ్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం కావడానికి కార్యదర్శుల పాత్ర ఎంతో ఉందని ఆయన అన్నారు. కార్యదర్శులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన అన్నారు. ఈఓపీఆర్డీ శ్రీనివాస్ ఏవో కె విక్టర్ జాన్సన్ కార్యదర్శులు ప్రసాద్, వెంకటేశ్వరరావు, నీరజ, రహీం పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



ఎ.గోకవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మణరావు

ఉంగుటూరు: పరిసరాల పరిశుభ్రతతో దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయడంతో పాటు పలు రకాల వ్యాధులను దూరం చేయవచ్చని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. బుధవారం మండలంలోని ఎ.గోకవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.ఆనందరావు, ఆరోగ్య పర్యవేక్షకులు నాగమణి, సరోజిని, వెంకటస్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ప్రయాణికులకు గాయాలు

ఏలూరు టౌన్: ఏలూరు నగర శివారులో బుధవారం ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఏలూరు నగరం నుంచి చెక్కపల్లి ప్రాంతానికి ముగ్గురు ప్రయాణికులతో ఆటో బయలుదేరింది. ఇద్దరు మహిళలు, పురుషుడు ఉండగా డ్రైవర్ ఆటోను నడుపుతున్నాడు. ఆటో ఏలూరు శివారు రవాణాశాఖ కార్యాలయం సమీపానికి చేరుకునే సరికి అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు.

అభివృద్ధి పనులకు దాతల సహకారం ఆదర్శనీయం



పోతునూరులో కేంద్ర మాజీ మంత్రి పర్వతనేని ఉపేంద్ర, కొమ్మారెడ్డి చిట్టితాత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్, పర్వతనేని వివేక్ ఆనంద్

దెందులూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులకు దాతల సహాయ సహకారాలు అందించడం ఆదర్శనీయమని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం పోతునూరులో సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ డీఎస్‌వీడీ ప్రసాద్ (బజ్జి), కొమ్మారెడ్డి వెంకటరత్నం, పర్వతనేని బసవయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 లక్షలు ఎంపీ నిధులతో స్వర్గపురి (హిందూ శ్మశానవాటిక), కొమ్మారెడ్డి సదాశివరావు జ్ఞాపకార్థం కుమారుడు కొమ్మారెడ్డి రాంబాబు, గ్రామంలోని దాతలు ఇచ్చిన రూ. 25 లక్షలతో నిర్మించిన దహన వాటిక, లోపల షెడ్డును ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, ట్రస్టు సభ్యులు, మాజీ కేంద్ర మంత్రి పర్వతనేని కుమారుడు వివేక్ ఆనంద్, పర్వతనేని రాంజీ, కొమ్మారెడ్డి వెంకటరత్నం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం స్వర్గపురిలో ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. పోతునూరు పీహెచ్‌సీని ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీచైర్మన్ పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులు విశ్రాంతి తీసుకునేందుకు రూ. 10 లక్షలతో త్వరలో విశ్రాంతి భవనం నిర్మిస్తామని ఎంపీ శ్రీధర్ అన్నారు. తొలుత స్వరాజ్ భవన్‌లో మాజీ కేంద్ర మంత్రి పర్వతనేని ఉపేంద్ర, ట్రస్టు వ్యవస్థాపకుడు కొమ్మారెడ్డి చిట్టితాత విగ్రహాలకు ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, ఎంపీటీసీ సున్నా నరేష్, దెందులూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, వెలమాటి మనోహరి, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్, బుద్ధా అర్జున, బీశెట్టి నూకరాజు, బత్రాజు సత్యనారాయణ, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

దెందులూరు: పోతునూరుకి చెందిన గంజి అరుణ్‌ను బుధవారం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి విజయవాడ అను వైద్యశాలలో పరామర్శించారు. వైద్యులను కలిసి అరుణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. వైద్యఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే రూ. 50 వేలు ఆర్థిక సాయాన్ని అరుణ్‌కు అందజేశారు. సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ డీఎస్‌వీ ప్రసాద్ (బజ్జి), పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, మండల నాయకులు నిట్టా గంగరాజు, రేషన్ డీలర్ల నాయకులు తలారి రామకృష్ణ, బత్రాజు సత్యనారాయణ, ఫణి తదితరులున్నారు.

ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయకం

దెందులూరు: పోతునూరు గ్రామంలో దాతలు, ప్రజాప్రతినిధులు కొమ్మారెడ్డి వెంకటరత్నం, పర్వతనేని బసవయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు దశాబ్దాల క్రిందట ఏర్పాటు చేసి గ్రామ శివారు ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన చేయడం ఆదర్శనీయమని ట్రస్టు సేవలను ఉపేంద్ర కుమారుడు పర్వతనేని వివేక్ ఆనంద్, సభ్యులు కొమ్మారెడ్డి వెంకటరత్నం, వీఎస్‌రామ్‌ప్రసాద్, కొమ్మారెడ్డి రాంబాబు సభ్యులంతా కొనసాగించాలని ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ట్రస్టు సభ్యులను శాలువా, పూలదండలు బొకెలతో సత్కరించారు.

సచివాలయ ఉద్యోగికి రాష్ట్రస్థాయి అవార్డు



కమిషనర్ లక్ష్మీ షా చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న అజీజ్

ఉంగుటూరు: వెల్లమిల్లి 2 సచివాలయంలో ఇంజినీరింగు సహాయకుడిగా పని చేస్తున్న షేక్ అబ్దుల్ అజీజ్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉద్యోగి అవార్డును అందుకున్నారు. ఈ మేరకు జీఎస్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ లక్ష్మీషా చేతులు మీదుగా అమరావతిలో ఈ వార్డును స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం అందుకున్నారు. గ్రామంలో గృహనిర్మాణాల్లోనూ ఇతర ఇంజినీరింగు పనుల్లో చురుకైన పాత్ర వహించి పనులు సకాలంలో పూర్తి చేయడంతోపాటు పారదర్శకంగా పనిచేయడంతో అజీజ్‌కు అవార్డు దక్కింది. సర్పంచ్ వస్కాకుమర రాజ, ఉపసర్పంచి నాగేశ్వరరావు కార్యదర్శి బాలాజీ, బాదంపూడి సొసైటీ అధ్యక్షుడు మల్లారెడ్డి శేషగిరి తదితరులు అజీజ్‌కు అభినందనలు తెలియజేశారు.

క్షేత్రస్థాయిలో పారదర్శక పాలన

ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



జల్లికొమ్మరలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గణపవరం (నిడమర్రు): ప్రజలకు క్షేత్రస్థాయిలో పారదర్శక పాలన అందించేందుకే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం సాయంత్రం జల్లికొమ్మర గ్రామంలో గడప గడపకు ఉత్సాహంగా జరిగింది. ఎమ్మెల్యే వాసుబాబు వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి రాత్రి 9 గంటల వరకూ సుమారు 180 ఇళ్లు తిరిగారు. బుధవారంతో గడపగడపకు కార్యక్రమంలో నియోజకవర్గంలో 193వ రోజుకు చేరుకుందని మండల కన్వీనర్ దండు రాము తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని ఎమ్మెల్యే అన్నారు. రూ65 లక్షల నిధులతో గ్రామ సచివాలయానికి, రైతు భరోసా కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించామన్నారు. మంచినీటి సదుపాల కల్పనకు ప్రత్యేక దృష్టి పెట్టి రూ.40 లక్షలతో రక్షిత మంచినీటి పథకంకు మైక్రోఫిల్టర్స్ ఏర్పాటు చెయ్యడంతోపాటు రూ.10 లక్షల నిధులతో గ్రామ మంచి నీటి చెరువు అభివృద్ధి పనులు, రూ.30లక్షల నిధులతో సీసీ రహదారులు నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఏవిధంగా ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించామన్నారు. ఇంటింటికీ తిరిగినప్పుడు స్థానికులు చెప్పిన సమస్యలు తక్షణం పరిష్కరించేలా గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఆర్‌బీకే చైర్మన్ కురెళ్ల త్రిమూర్తులు, సొసైటీ అధ్యక్షులు మద్దాల అర్జునరావు, ఉప సర్పంచ్ తంగెళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు బుద్దాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులందరినీ పాఠశాలల్లో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి, ఎంఈవో ఈ.శ్రీనివాసరావు

భీమడోలు: బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించే బాధ్యత హెచ్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్లదేనని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి అన్నారు. భీమడోలు ఎంఆర్‌సీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్, నాడు-నేడు పథకం పనులు పురోగతి తదితర అంశాలపై ఎంఈవో ఈ.శ్రీనివాసరావుతో కలిసి ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సీహెచ్ పద్మావతి దేవి మాట్లాడుతూ మండలంలోని 1042 మంది డ్రాపవుట్స్‌గా ఉన్నట్లుగా నివేదికలు చూపుతున్నాయని, వాటిని రెండు, మూడు రోజుల్లో వారందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. ఇతర కారణాలతో బడులు మానేస్తే వారి వివరాలను సేకరించాలన్నారు. అలాగే మండలంలోని నాడు-నేడు పథకానికి సంబంధించి పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. టాయిలెట్లను నూరుశాతం వినియోగంలోకి తీసుకుని రావాలన్నారు. లేని పక్షంలో సంబంధిత ప్రధానోపాధ్యాయులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల హెచ్‌ఎంలు, సంక్షేమ సహాయకులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

లాయర్ రాముకు అభినందనలు



న్యాయవాది రాముని సత్కరిస్తున్న నాయకులు

నిడమర్రు: అడవికొలను సొసైటీ మాజీ అధ్యక్షులు నిమ్మల రామును వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ కమిటీ తరుపున ఆ కమిటీ జాయింట్ సెక్రటరీ సంకు నాగేశు ఘనంగా సత్కరించారు. బుధవారం బువ్వనపల్లిలోని శేషు ఇంటి వద్ద ఈ అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నిమ్మల రామును రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిల్లా కోర్టులో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీసీ) విభాగంలో ప్రభుత్వ లాయర్‌గా నియమించింది. దీన్ని పురస్కరించుకుని వైఎస్సార్ స్టేట్ యూత్ కమిటీ సభ్యులు రామును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ నౌడు వెంకట అచ్యుతరామారావు, బావాయిపాలెం సర్పంచ్ బాలాజీ పద్మావతి, మండల ఉపాధ్యక్షుడు పూసల వెంకటేశ్వరరావు, గణపవరం టౌన్ అధ్యక్షులు రొంగల శ్రీను, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మండల రామకృష్ణ, సంకు తాతాజీ, పూర్ణ, పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఉప ఎన్నికల్లో ప్రచార జోరు



వీరమ్మకుంటలో ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా రోడ్డుషోలో పాల్గొన్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: పంచాయతీ ఉప ఎన్నికలలో భాగంగా వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ వీరమ్మకుంట, వెంకటాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు మాట్లాడుతూ వెంకటాపురంలో రానున్న కొద్ది రోజుల్లో రహదారులు అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో రామాలయం నిర్మాణానికి సీజీఎఫ్ నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. వీరమ్మకుంటలో ప్రధాన రహదారుల వెంబడి రోడ్డు షో నిర్వహించారు. గడపగడపకు కార్యక్రమంలో గ్రామస్తులు తెలిపిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పాతముప్పర్రుకు వెళ్లే రోడ్డు పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ బలపర్చిన అభ్యర్థి సోమేశ్వరరావు ఎన్నికల గుర్తు కత్తెరపై ఓటు వేయాలని చెప్పారు.జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, ఎంపీటీసీ పూడి అప్పలస్వామి, పూడి రంగప్పారావు, మాజీ సర్పంచ్ దాసరి పెదబాబు, గుణుపూరు మహేష్, ఏలూరు మండల కన్వీనర్ తేరా ఆనంద్, మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, కత్తుల రవికుమార్, ఘంటసాల ప్రభాకరరావు, కోటిరెడ్డి, ఇంద్రకీలాద్రి ట్రస్టు బోర్డు మెంబరు తొత్తడి వేదకుమారి కృష్ణ, మండల సచివాలయాల కన్వీనర్ అక్కినేని గోపి, సీనియర్ నేత పోకల రాంబాబు, గొట్టాపు నర్సింహరావు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు బహుమతులు

పెదపాడు : స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో 2022-23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు గూడపాటి నాగేశ్వరరావు, గూడపాటి శేషగిరిరావు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున అందించారు. 6 నుంచి 10వ తరగతి వరకు మెరిట్ సాధించినవారికి నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, స్థానిక సర్పంచ్ కొత్తూరు జీవన కుమారి, గారపాటి మోహనరావు చేతులు మీదుగా విద్యార్థులకు అందించారు. మానవత సభ్యులు రాంబాబు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పేర్ల సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు పీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలకు సీసీ కెమేరాల బహూకరణ

పెదపాడు: చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులకు తమ వంతు సహకారం అందించడం మంచి పరిణామని దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ తెలిపారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97లో పదో తరగతి చదివిన విద్యార్థులు అడుసుమిల్లి బాలకృష్ణ, పఠాన్ అయూబ్‌ఖాన్ రూ.60వేలు విలువైన సీసీ కెమేరాలను అందించారు. వీటిని దెందులూరు ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్ చేతులు మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోట పుష్పావతికి వారు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి, ఎంపీటీసీ బుద్దే రామసీత, సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, రమాదేవి, మానవత చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అవార్డులతో మరింత బాధ్యత



భీమడోలులో జిల్లా అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ

భీమడోలు: అవార్డులను మరింత బాధ్యతను పెంచుతాయని భీమడోలు తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ అన్నారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండల వీఆర్వో అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాలఓ ఉత్తమ సేవ అవార్డులను స్వీకరించిన డిప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్, పోలసానిపల్లి వీఆర్వో డి.సింహాచలం తదితరులను ఘనంగా సత్కరించారు. మండల అధ్యక్షుడు కందులపాటి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతోను, సమర్థవంతంగా సేవలందించిన ఇద్దరికి అవార్డులు రావడం చాలా సంతోషకరమై విషయమని హర్షం వ్యక్తం చేశారు.


పంచాయతీ వార్డు మెంబర్లు ప్రచారం ముమ్మరం

దెందులూరు: మండలంలో నాలుగు పంచాయతీ వార్డు మెంబర్ల స్థానాల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గోపన్నపాలెం 11వ వార్డుకు వీరంకి రేవతి, సీతంపేట పంచాయతీలో 11వ వార్డుకు బుద్దిరెడ్డి వెంకటరమణ, 5వ వార్డుకు రాఘవ రామతులసమ్మ, కొవ్వలి 11వ వార్డుకు మెండి శ్రీను అభ్యర్థులు పోటీ చేస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. గోపన్నపాలెం అభ్యర్థి వీరంకి రేవతికి గౌను గుర్తు, సీతంపేట అభ్యర్థి రాఘవ రామతులసమ్మకు స్టూల్ గుర్తు, బుద్దిరెడ్డి వెంకటరమణకు కుక్కర్ గుర్తు, కొవ్వలి అభ్యర్థి మెండి శ్రీనుకు గౌను గుర్తులు లభించాయి. అభ్యర్థుల కు కేటాయించిన గుర్తులతో తమ మద్దతుదారులు, పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్నారు.

నేడు జల్లికొమ్మరలో గడపగడపకు మన ప్రభుత్వం

గణపవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం (194వ రోజు) జల్లికొమ్మర గ్రామంలో గురువారం సాయంత్రం 4.30 గంటల నుంచి వరుసగా రెండవ రోజు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నాయకుడు దండు రాము తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిననాటి నుంచి జరిగిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితుడికి పరామర్శ



ఏలూరు జీజీహెచ్‌లో బాధితుడ్ని పరామర్శిస్తున్న డాక్టర్ దిరిశాల వరప్రసాద్, డిప్యూటీ మేయర్ సుధీర్, ఏఎంసీ వైస్ చైర్మన్ రామకృష్ణ

ఏలూరు టౌన్: పోణంగి కొత్త దళితవాడలో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ అగ్నిప్రమాదంలో పరసే డేవిడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్లనాని ఆదేశాల మేరకు రాష్ట్ర మెడికల్, ఫార్మసీ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాదరావు, ఏలూరు డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, కార్పొరేటర్ దారపు తేజ హాస్పిటల్‌లో వైద్య చికిత్స పొందుతున్న అగ్నిప్రమాద బాధితుడు డేవిడ్‌ను పరామర్శించారు. బాధితునికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్‌కు సూచించారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.

సమస్యలపై పోరాటం

ఏలూరు (టూటౌన్): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, ఎనర్జీ అసిస్టెంట్లు సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం నిర్వహించనున్నట్లు ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ జిల్లా చైర్మన్ జె.శ్రీనివాస్ స్పష్టం చేశారు. పవర్ జేఏసీ చేసిన ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 17న కార్మిక శాఖ అధికారులకు లేఖలు ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎస్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 17న నిర్వహించనున్న విద్యుత్ సౌధ ధర్నా వాయిదా వేసినా జిల్లాలో పోలీసులు ఉద్యోగులను తీవ్రంగా వేధిస్తున్నారన్నారు. ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని వినతి

ఏలూరు (టూటౌన్): పేదలు, దళితులు 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం హక్కు పత్రాలు ఇవ్వాలని, యాజమాన్య హక్కు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని కోరుతూ డీఆర్‌ఓ మూర్తికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం బుధవారం వినతిపత్రం అందించింది. దెందులూరు మండలం పోతునూరు, దోసపాడు, కొవ్వలి, దెందులూరు గ్రామాల్లో సుమారు 1,500 ఎకరాలు ప్రభుత్వ అసైన్డ్, సీలింగ్, గయాళ్ళ భూములు స్థానిక, స్థానికేతర భూస్వాముల చేతుల్లో ఉన్నాయన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఏ.రవి, ఎం.జీవరత్నం పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.1.75 లక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పత్తేబాదలోని నాలుగు గుడుల సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మ వారి ఆలయంలో బుధవారం అమ్మవారి హుండీ ఆదాయం లెక్కించారు. ఈ లెక్కింపులో అమ్మవారికి హుండీల ద్వారా రూ. 1,75,944 ఆదాయం సమకూరింది. ఈ ఆదాయం 154 రోజులకు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి డీ. శంకరరావు తెలిపారు. నగరంలోని రంగ్రీజులు మఠం గ్రూప్ దేవస్థానాల కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ బీహెచర్ రామనాగ శంకర్, ట్రస్టీలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానా

ఏలూరు టౌన్: ఏలూరులో మద్యం తాగి ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే భారీ మూల్యం తప్పదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి న్యాయస్థానం రూ.10వేలు జరిమానా విధించటం విశేషం. ఈ నేపథ్యంలో మద్యంతాగి మోటారు సైకిళ్లు నడపటం మానుకోవాలని ఏలూరు వన్‌టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్ వాహనదారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు మోటారు సైకిళ్ల యజమానులు డ్రైవింగ్ లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలని సీఐ తెలిపారు. సీఐ రాజశేఖర్ వన్‌టౌన్ ప్రాంతంలో వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఐదుగురు వాహనచోదకులు మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి అనంతరం బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికీ రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.